

# శ్రీరాజ్

# వాలుపొద్దు

మరి కాసేపట్లో పడమటి కొండల్లోకిసూర్యుడు వెళ్ళిపోతాడు. ప్రపంచం నిస్త్రాణంగా మిగిలిపోతుంది. ప్రకృతిలో మౌనరోదన మొదలవుతుంది.

స్పెషల్ వార్డులో బెడ్ మీద ఉన్న జాహ్నవి ముడుకుల మీద తలపెట్టుకుని శూన్యంలోకి చూస్తుంది.

జాహ్నవి ఎన్నో రోజులు బతకదని డాక్టర్లు చెప్పారు. తన భర్త, పిల్లలు చేస్తున్న హడావుడికి ఆమెకు నవ్వొస్తుంది. ఆ విషయం ఆమెకీ తెలుసు. తన చావు గురించి విన్నప్పుడు ఆమె భయపడలేదు. కనీసం ఒక కన్నీటి బొట్టయినా వెలుపలికి రాలేదు. పైగా ఆమె మనసునిండా ప్రశాంతత చోటుచేసుకొంది. ఆమె అనుభవిస్తున్న నరకయాతనతో పోల్చుకుంటే మృత్యువు చాలా స్వల్పమైన దనిపిస్తుంది.

ఎలాంటి ఒడుదుడుకులు లేని జీవితం.

ఎంతో ప్రేమగా చూసుకొనే భర్త.

ఎన్నో అనురాగాలు కురిపించే బిడ్డలు.

అయినప్పటికీ ఆమెలో అశాంతి తప్ప ఏమీ మిగలలేదు. ఆ అశాంతి యిప్పటిది కాదు. ఇరవై ఏళ్ళుగా వేళ్ళు పాతుకొని ఆమెను పిసరుపిసరుగా కబళించి వేస్తుంది. ఆ నైరాశ్యం నుండి బయటపడటానికి చాలా సార్లు ఆమె ప్రయత్నించింది గానీ మన శ్శాంతి మాత్రం లభించలేదు.

అందుకే ఆమెకి ప్రాణంమీద తీపి లేదు. బతకాలనే ఆశ లేదు. ఏ రాగ ద్వేషాల్లేని ప్రశాంతమైన లోకాలకు వెళ్ళిపోవాలని మనసు తొందరచేస్తుంది.

జాహ్నవి నెమ్మదిగా లేచి, బాల్కనీవేపు నడిచింది.

మసక చీకట్లు పరుచుకుంటున్నాయి. దూరంగా ఉరకలువేస్తున్న సముద్రం, కెరటాల మీద కిందికి మీదికి ఊగుతున్న చిన్న పడవలు, అవతలి తీరానికి సాగిపోతున్న పెద్ద స్టీమర్లు, ఒడ్డున అటు ఇటూ కదులుతున్న పిపీలకంలాంటి మనుషులు - కనిపిస్తూన్న ఆ దృశ్యంలో ఎంతటి అలజడి ఉన్నా, గదిలో వాతావరణం స్తబ్దుగా ఉంది. అందులో మౌనం ఆమెను భయపెడుతుంది.

బాధగా నిట్టూర్చి జాహ్నవి వెనక్కి తిరిగింది.

ఎవరికీ చెప్పుకోలేని మూగవేదన. మనసుని పిండుతుంది. నిస్సత్తువుగా కళ్ళు మూసుకొని, అక్కడే గోడకి ఆనుకొని నిలబడింది.

గతం తాలూకు పునశ్చరణ ఆమె కళ్ల ముందు లీలగా కదులుతుంది.

"జాహ్నవీ! నువ్వు నా కన్యాయం చేసి వెళ్ళిపోతానని నేను ఎంత భయపడ్డానో?....నువ్వుంటే చాలు. నాకు ఏమీ వద్దు. మనకి పిల్లలే వద్దు....నిన్ను చూస్తూ ఈ జీవితం గడిపేయగలను."

భార్య తల నిమురుతున్న రంగధామ్ చేతులు ఇంకా వణుకుతూనే ఉన్నాయి. భాషకి అందని భావమేదో అతని అంతరంగంలో ఇంకా కొట్టుకుంటూనే ఉంది. సరిగ్గా మాటలు పెదవులుదాటి రావడం లేదు.

ముందు రోజు రాత్రి జాహ్నవి ప్రసవవేదన పడినప్పుడు నర్సింగ్‌హోం వరండాలో పచార్లుచేస్తున్న అతను విలవిల్లాడిపోయాడు. రెండవ కాన్పు. అయినా ఆమె పునర్జన్మ ఎత్తవలసి వచ్చింది.

అతని కళ్ళలోకి అనురక్తి భావానికి జాహ్నవి కళ్ళు చెమ్మగిల్లాయి. ఆమె చెక్కిలిమీదుగా కిందికి జారిపడుతున్న కన్నీటి బొట్టుకి అతను దోసిట పట్టాడు.

అతని ఒడిలో తల పెట్టుకొని చాలా సేపు జాహ్నవి మౌనంగా ఉండిపోయింది.

తనకోసం కన్నీరు పెట్టుకొనే భర్త, తన కన్నీటిని చూడలేని పెన్నిధి, తన మనసుని అర్థంచేసుకొనే మనిషి, తన కోసం ప్రాణం ఇచ్చే దేవుడు - అంతటి అదృష్టం ఎందరి కుంటుంది?

ఆమె జీవితంలో ఎన్నో అనుభూతులు, అనుభవాలు, మమతలు, మధురిమలు, ఎన్నెన్నో ఊహలు, ఊసులు, తియ్యదనాలు, త్యాగాలు - ఆకాశంలో హరివిల్లులో రంగుల్లా రాగరంజితంగా పెనవేసుకున్నాయి.

రంగధామ్ క్షణం విడిచి ఉండటానికి ఇష్టపడడు. జాహ్నవితో మాట్లాడని క్షణాలుంటే - అవి కేవలం అతను ఆఫీసులోఉన్నప్పుడు నిద్రపోయినప్పుడు మాత్రమే.

వాళ్ళ దాంపత్యం మధురమైన సాగర సంగమం లాంటిది.

హఠాత్తుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకొని, కళపెళ ఉరుములు మెరుపులతో ప్రకృతి భీకరంగా మారిపోయింది. సముద్ర తరంగాలలో కల్లోలం పుట్టి బడబాగ్ని రగులుకుంది.

ఎలాంటి బీభత్సానికైనా ఒక్కక్షణం చాలు. అగ్నిగుండంలా మారటానికి త్రుటికాలం చాలు.

అలాగే జాహ్నవి జీవితంలో కల్లోలం మొదలయ్యింది.

హిమాలయాల్లో తపోభంగమైన ఋషిలా కాకుండా, మిన్నువిరిగి కిందికి ఒరిగిపోతే సంభవించిన ప్రళయంలా కాకుండా, ఒక్కొక్క కాంతిపుంజాన్ని మింగి అంతటా ఆక్రమించిన నీరవ నిశీధిలా కాకుండా-కేవలం చిన్న ఉద్విగ్నత, ఉదాసీనత కారణంగా యుగాల మౌనం ఆ భార్యాభర్తల మధ్య చోటు చేసుకుంది.

ఆ దూరం ఎప్పట్నుంచి? ఎంత ఆలోచించినా, ఎన్నెళ్ళు ప్రయత్నించినా అంతుబట్టడం లేదు. అతను తనతో ఎందుకు మాట్లాడటంలేదో, ప్రతి క్షణం మౌనంగా గడపటంలో ఆంతర్యం ఏమిటో ఆమెకి అర్థంకాలేదు.

జవాబు దొరకని ప్రశ్న అయిపోయింది.

తను చేసిన అపరాధం ఏమిటి? అతను పిల్లలతో సరదాగా గడుపుతారు. వచ్చేపోయే బంధువులతో మాట్లాడతారు. స్నేహితులతో కబుర్లు చెప్తారు. ఏ విషయంలో తనని అశ్రద్ధ చేయరు. క్షణాల్లో తనకు కావలసినవి సమకూర్చి పెడతారు. చీరలు కొంటారు. నగలు చేయిస్తారు. అవన్నీ తను కోరుకోవడంలేదు. అతను ఒక్కసారి తనతో మాట్లాడితే చాలు. కానీ అతను మౌనంగా ఉంది, తన గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నారు. తన మాటకి బదులు యివ్వరు. పిల్లలకి చెప్తారు. ఏది కావాలన్నా చేయాలన్నా పిల్లల ద్వారా అడిగిస్తారు.

నేరం చెయ్యకుండా శిక్ష అనుభవించడం ఆమెకి కష్టంగా ఉంది.

ఎన్నోసార్లు అతనితో తన బాధ చెప్పుకుంది. నిజం చెప్పమని వేడుకొంది. మనశ్శాంతి యిమ్మని బతిమాలింది. ఒక్క మాట చెప్పి, తనని బతికించమంది. అంతరాంతరాల్లో ఉక్రోషం తన్నుకొచ్చినప్పుడల్లా ఎదురుతిరిగింది కూడా.

అన్నిటికీ అతన్నుండి వచ్చే సమాధానం ఒక్కటే - అదే నిర్లిప్తత....అదే ముభావం....అదే ఉదాసీనత....

అతను అనారోగ్యంగా చాలాకాలం మంచంమీద ఉన్నారు. ఆ మౌఢ్యానికి కారణం మానసిక రుగ్మత లాంటిది. ఏదైనా ఉంటుందని డాక్టర్లను సంప్రదించడం జరిగింది. కానీ, అది వట్టి భ్రమ అని తేలింది. నిజమే, మరి. అందరితో కలివిడిగా మాట్లాడే అతను- ఏదో ఉద్దేశపూర్వకంగా తనతో మాట్లాడటం లేదని తెలుస్తుంది.

ఆమెలో దుఃఖం పెల్లుబికింది.

అలాంటి అనిశ్చలత వాతావరణంలోనే రోజులు దొర్లిపోయాయి. ఎన్నో వసంతాలు వెనక్కి వెళ్ళి, కొత్త చరిత్ర పుటల్ని సృష్టించాయి.

ఆ ఇంట్లో ఎన్నో మార్పులు జరిగాయి. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ఇద్దరూ చదువుకొని వృద్ధిలోకి వచ్చారు. వాళ్ళ ముద్దూముచ్చటా బాగానే జరిగాయి. వాళ్ళ భవిష్యత్తును తీర్చిదిద్దటంలో

ఎప్పుడూ లోపం జరగలేదు. అన్నీ యాంత్రికంగా నడిచిపోతున్నాయి. ఏదీ ఆగిపోవడంలేదు. జీవనవాహిని చరచరా ముందుకి సాగిపోతుంది.

అయినా-

అతని వైఖరిలో మార్పులేదు. తనతో ముభావంగా ఉండటమే అతని అభిమతం కాబోలు. తనకి బదులు ఇవ్వకుండా మౌనం పాటించడమే అతని ధ్యేయం కాబోలు. మనిషి మనసు ఎంత సున్నితమైనది! నిరంతరం తన మనసులో ఘర్షణ తలఎత్తుతుంది. అతనిలో ఉదాసీనతకు క్షణక్షణం కోటానుకోట్ల మైళ్ల కిందికి జారిపోతుంది.

మనసా వాచా కర్మణా తను ఎలాంటి పాపమూ చేయలేదు. అతని ఇల్లాలిగా పరమ పవిత్రంగా, త్రికరణశుద్ధిగా అతని సాన్నిధ్యంలో తన బతుకుపండాలని కోరుకుంది. కోరుకుంటుంది కూడా.

కళ్ళు మూసేముందు అతను ఒక్కసారి మాట్లాడితే చాలు. గాలికి రెపరెపలాడుతున్న దీపం ఆరిపోయేముందు ఆ నిజం తెలిస్తే చాలు. తను తృప్తిగా వెళ్ళిపోతుంది. తన కన్నీటితో అతని మనసుని ప్రక్షాళన చేస్తుంది. ఆ ఒక్క వరం తనకి లభిస్తే తన జీవితం ధన్యమయినట్లే.

కథ ఎన్నో మలుపులు తిరిగింది. ఇంకా పతాక సన్నివేశం మాత్రం మిగిలి ఉంది. అది తన చావుతో పరిసమాప్తి కాబోతుంది.

జాహ్నవి కళ్ళనుండి ధారపాతంగా వస్తున్న కన్నీళ్ళు — అప్పుడే వెలిగిన లైటు కాంతిలో తళుక్కున మెరిశాయి.

* • *

వయసు పెరగడం వలన, జబ్బుపడినందువలన కాకుండా మానసికంగా అలసిపోవటం వలన జాహ్నవి నిస్తేజంగా ఉంది.

అక్కడ గదిలో ఆమె కొడుకు,




కూతురు, కోడలు, అల్లుడు, వాళ్ళ పిల్లలు, బంధువులు ఆత్మీయులు ఉన్నారు. అందరిలో అవ్యక్తమైన ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఒంట్లో బావులేనప్పట్నుంచి అత్తగారి సపర్యలన్నీ కోడలు చేస్తుంది. తల్లి తొందరగా కోలుకోవాలని వెయ్యిదేవుళ్ళకి మొక్కుతుంది కూతురు. కొడుకు అసలు ఆఫీసుకే వెళ్ళడం లేదు. అమ్మను బతికించుకోవాలని ఆరాటపడుతున్నాడు. ఏమీ చెయ్యలేకపోతున్నందుకు అల్లుడు బాధపడుతున్నాడు.

వచ్చిపోయే చుట్టాలు స్నేహితులు ఆమెను పరామర్శిస్తున్నారు. సానుభూతి కురిపిస్తున్నారు. ఓదార్పుగా మాట్లాడుతున్నారు.

జాహ్నవి ఎవర్నీ పట్టించుకోవడం లేదు. స్తబ్దుగా మంచంమీద కూర్చుంది. జీవంలేని నవ్వొకటి ఆమె ఎండిన పెదవులమీద నిలిచింది.

దూరంగా ఒంటరిగా నిలబడిన రంగధామ్ దోసిట్లో మొఖం దాచుకుని మౌనంగా దుఃఖాన్ని దిగమింగుకుంటున్నాడు. జాహ్నవి చూపు అతనిమీద నిలిచింది.

అతను బాగా నీరసించిపోయాడు. కళ్ళలో దైన్యం, మొఖంలో భయం, మనిషిలో ఆందోళన చోటు చేసుకున్నాయి. ఆమెకి తెలుసు-తనకోసం అతను పడుతున్న ఆవేదన ఎలాంటిదో! తనని బతికించుకోవటానికి అతను చేసే ప్రయత్నాలు ఎన్నో! తను కళ్ళు మూస్తే అతను ఏమైపోతారో? తను జబ్బుపడ్డప్పట్నుంచీ అతను నిద్రాహారాలు

మాని, పిచ్చిపట్టినట్లు తిరుగుతున్నారు.

జాహ్నవి కళ్ళలో అభ్యర్థన అర్థం చేసుకొని అంతా గదిబయటకు వెళ్ళి పోయారు.

"ఏవండీ! ఒక్కసారి ఇలా రండి" ఆమె హీనస్వరంతో భర్తను పిలిచింది.

రంగధామ్ అచేతనంగా వచ్చి, మంచం దగ్గర నిలబడ్డాడు.

మౌనం....ఉదాసీనత.. నిశ్శబ్దం.... వాటిని భరించే ఓపిక ఈ క్షణంలో లేదు.

"నేను ఎన్నోరోజులు బతకనని నాకు తెలుసు."

అతను దిగ్గున తలఎత్తి గాభరాగా ఆమె మొఖంలోకి చూశాడు.

"నాకోసం మీ ఆరోగ్యం పాడు చేసుకోకండి....మీ చేతుల్లో పోవడం కన్న నాకు మరో అదృష్టం ఉండదు."

అతని కళ్ళలో నీరు టపటపా కిందికి జారిపడింది.

"ఏవండీ! ఈ ప్రాణం పోయేముందు మీ ఒడిలో తలపెట్టుకోవాలని ఉందండీ.. మీరు కాదనరు కదూ!" ఆమె గొంతు పూడుకుపోయింది.

రంగధామ్ మౌనంగా ఆమె పక్కకి వెళ్ళి కూర్చున్నాడు. జాహ్నవి కళ్లు మిలమిల మెరిసిపోయాయి. అతని వడిలో ఆర్ద్రతగా తలపెట్టుకొని, దుఃఖం ఆపుకోలేక వలవల ఏడ్చింది.

అతని ఒడిలో అలాగే తల దాచు కోవాలని, అతని గుండెలమీద నిద్ర పోవాలని, స్నానంచేసిన అతని తల రుద్దాలని, అతనికి స్వయంగా అన్నం తిని పించాలని, ప్రతిక్షణం అతనితో మాట్లా డాలని....ఎన్నెన్నో చెయ్యాలని ఆమె మనసు ఉబలాటపడుతుంది.

కానీ, వాలుపొద్దులో ఎలా సాధ్యం? కొన్ని నిమిషాలు నిశ్శబ్దం చోటు చేసుకొంది.

"ఏవండీ! అర్థాంతరంగా నాతో మాట్లాడటం ఆపేశారు. నా తప్పేమిటో చెప్పకుండానే ఇరవై యేళ్ళ శిక్ష వేశారు....నన్ను క్షమించమని అడగను. ఇంకా దారుణంగా నన్ను శిక్షించండి. కానీ, ఒక్కసారి పెదవి విప్పి, ఒక్క మాట చెబితే చాలు...ఒక్క మాటేనండీ. మీలో చోటుచేసుకున్న మౌనానికి గల కారణం ఏమిటి? అందుకు నా బాధ్యత ఎంతవరకు ఉంది? .... నిజం తెలిస్తే, నేను తృప్తిగా కళ్ళుమూస్తానండీ.... కాదనకండి. ప్లీజ్....చెప్పండి.... చెప్పండి...."

అతను భారంగా కళ్ళు మూసు కున్నాడు. ప్రయత్నించినా అతని పెదవి దాటి ఒక్క అక్షరం కూడా బయటకు రాలేదు. లోపల ఎవరో తన గొంతు పట్టుకొని పిసుకుతున్నారు.

తన అశక్తతను కళ్ళతో చెప్పి, అక్కడ నుండి బయటకు నడిచాడు రంగధామ్.

జాహ్నవి గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలయి లావా పొంగుకొస్తుంది.

* * *

ఆ రోజు—

ఆ వాతావరణం—

ఆ దృశ్యం—

ఇంకా రంగధామ్ మనసులో ముద్ర వేసుకొనే ఉన్నాయి. ఆ సంఘటన ఎప్పటికీ చెరిగిపోదు. ఆ చేదునిజం ఎన్నటికీ తుడుచుకుపోదు.

నీటిలో సగంవరకు మునిగి ఉన్న బండరాయి మీద ఒంటరిగా ముడుకుల్లో తలదాచుకొని, కనబడని అవతలి తీరం వరకు దృష్టి సారించాడు రంగధామ్. సముద్రంలో కెరటాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి. అప్పుడప్పుడు నీటి తుంపర్లు మొఖానికి చిన్నగా తగులు తున్నాయి. ఒరసికొంటున్న చిన్న అలలు-అతను కూర్చున్న రాతిని అదే పనిగా తడుపుతున్నాయి తప్ప కరిగించ లేకపోతున్నాయి.

యుగాలుగా కెరటాలకి బండరాళ్ళకి మధ్య జరుగుతున్న పోరాటంలో కెర టాలు ఎప్పటికప్పుడు విరిగి ముక్క లవడమే తప్ప ఎప్పుడూ ఒక బండ రాయిని బద్దలుచేసినట్లు రుజువు కని పించడం లేదు.

గతాన్ని బలవంతంగా పునరావృత్తం చేసుకోవడం మొదలుపెట్టాడు అతను.

ఆపరేషన్ జరిగిన వారం రోజులకి హాస్పిటల్ నుంచి రంగధామ్‌ని డిస్చార్జీ చేశారు. ఇంటికి వచ్చి రెండు రోజు లయింది. మరి కొంతకాలం మంచం మీదే ఉండాలని, విశ్రాంతి తీసుకోవాలని డాక్టరు సలహా యిచ్చాడు.

ఆ సాయంకాలం నానారావు పూల గుచ్ఛం ఒకటి 'విష్యూ స్పీడీ రికవరీ' అంటూ తన చేతి కిచ్చాడు. నానారావు జాహ్నవికి వరసకి బావ అవుతాడు. మంచి స్థితిమంతుడు. తన ఆపరేషన్ కోసం చాలా డబ్బు కావలసి వచ్చింది. నానారావు జాహ్నవి మాట కాదనలేక పోయాడు. అతని సహాయ సహకారాలు అందించి, తనకి మరో జన్మ యిచ్చాడు.

నానారావు అందించిన పుష్ప గుచ్ఛాన్ని కృతజ్ఞతగా తీసుకున్నాడు. అయితే, మరికొన్ని గంటల్లో అతను తన మనసులో, జీవితంలో విషాన్ని చీకట్నీ చిందించబోతున్నాడని ముందుగా ఊహించలేకపోయాడు.


చీకటి ముసురుకొంది. ముసురు మొదలయ్యింది. చినుకు చినుకు జడి వానకు దారితీశాయి. తనూ, జాహ్నవి బలవంతం చేసేటప్పటికి, వాళ్ళ మాట కాదనలేకపోయాడు, నానారావు.

"బావా! ఈ రాత్రి నువ్వు వెళ్ళటానికి వీల్లేదు. మాతోనే ఉండాలి."

"కాదని వెళ్ళిపోతే?...."

"అమ్మో! వానలో తడిసిపోతావు, బావా!....వద్దు. నిన్ను వెళ్ళనివ్వను."

(యువ 1966 దీపావళి ప్రత్యేక సంచిక నుంచి)




"సరే! నువ్వుండమన్న తర్వాత ఎలా కాదనగలను? తప్పకుండా ఉంటాను."

"థాంక్యూ బావా! థాంక్యూ సో మచ్...."

"మరి ఈ బావకి ఏం మర్యాదలు చేస్తావో చూడాలి."

"నువ్వు కోరుకున్న మర్యాదలు చేస్తాను. ఓకే...."

బావామరద లిద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. సరదాగా నవ్వుకున్నారు. ఒకర్నొకరు ఆట పట్టించుకున్నారు.

అర్ధరాత్రి దాటింది.

బయట వర్షం కుండపోతగా కురుస్తుంది.

గొంతు పిడచకట్టుకు పోతుంటే, తను అస్తవ్యస్తంగా అటూఇటూ పక్క మీద దొర్లాడు. గదిలో జాహ్నవి కనిపించలేదు. మంచినీళ్ళ కూజా దగ్గరలో లేదు. ఆమెను పిలిచాడు. జవాబు రాలేదు.

మరి కాసేపు అసహనంగా అలాగే కదిలాడు. ఎడారిలో మండుతున్న ఎండలో అడుగుతీసి అడుగు వేయలేక పోతున్న అనుభవం. శక్తిని కూడదీసుకొని, అతి కష్టంగా లేచాడు.

మంచినీళ్ళ కోసం తూలిపడుతూ గోడను ఆసరాచేసుకుంటూ ముందుకి నడిచాడు.

పక్క గదిలో దృశ్యం చూసి, అతను నిశ్చేష్టుడై పోయాడు.

మెదడులోని నరాలు పటాలున తెగి వెచ్చటి నెత్తురు ఎగజిమ్మి ఆకాశపు టంచుల్ని తాకి, ప్రపంచాన్నే ఎర్రటి రంగుతో మరకలు చేసినట్లు తనలో ఉద్విగ్నత కలిగింది.

తన చేతుల్లోకి మరదల్ని లాక్కుంటున్న నానారావు, బావ గుండెలమీద పడబోతున్న జాహ్నవి—నారింజ రంగు కాంతిలో జుగుప్స కలిగిస్తున్న సన్నివేశం అది. ఒక్క క్షణం....అంతకన్న ఎక్కువసేపు అక్కడ నిలబడలేక పోయాడు.

అంతే! మంచమ్మీదకు వచ్చిపడ్డాడు.

ఆ ట్రాన్స్‌లో తను చాలాకాలం ఉండిపోయాడు. జబ్బు మళ్ళీ తిరగబెట్టిందని అంతా అనుకొన్నారు. మందులు, డాక్టర్లు, ఉపచర్యలు జరిగిన తర్వాత మామూలు మనిషయ్యేసరికి మూడు నెలలు పట్టింది.

తనలో నిరంతరంగా జరుగుతున్న మానసిక సంఘర్షణ మాత్రం అతన్ని విడిచిపెట్టలేదు.

తన ప్రాణానికి ప్రాణంగా చూసుకొనే జాహ్నవి నైతికంగా పతనం అయింది. తన భార్య మరో మగవాడితో ఉందని ఊహించటానికే ఏ వ్యక్తీ యిష్టపడడు. మూడు నిమిషాల్లో తనని తన మనసుని, సంసారాన్ని, పిల్లల్ని, పరువు ప్రతిష్ఠల్ని సర్వనాశనం చేసిన ఆమెను ఎలా క్షమించడం? ఈ మానసిక వ్యధ ఎవరితో చెప్పుకొని ఉపశమనం పొందగలడు?

ఆమెను తన ఇంట్లో ఉండనివ్వకూడదు. తన జీవితంనుండి దూరంగా పొమ్మని చెప్పాలి. ఆమెకి తన మనసులో చోటులేదని తెలియజేయాలి. కానీ.... రేపు ఏడేళ్ళ బాబు, అయిదేళ్ళ పాప—'అమ్మ ఎక్కడ?' అని అడిగితే ఏ సమాధానం తను యివ్వాలి? నిజం చెప్పి, పసివాళ్ళ హృదయాల్ని ఎలా గాయపరచగలడు?

కాదు .... అలా చేయకూడదు. ఆ ఇంటికీ జాహ్నవికి దూరంగా ఎక్కడో తెలియని చోటుకి తను వెళ్ళిపోవాలి. గత జీవితాన్ని పూర్తిగా మరిచిపోవాలి. అప్పుడు తనకి మనశ్శాంతి ఉంటుంది. కానీ .... మళ్ళీ పాత ప్రశ్నే ఎదురవుతుంది. నిజం తెలిసిన రోజున తన పిల్లలు తల్లిని ఎందుకు నిలదీయరు? ఆమెను అసహ్యించుకోకుండా ఉండగలరా?

తను బాగా ఆలోచిస్తే, జాహ్నవి కావాలని తప్పుచేయలేదనిపిస్తుంది. తనని బతికించడం కోసం ఆమె ఎంతో త్యాగం చేసింది. రాత్రీ పగలూ తన దగ్గరే ఉండి ఎన్నో సేవలు చేసింది. డబ్బు అవసరం వచ్చినప్పుడు, సహాయం ఎక్కడా దొరకనప్పుడు—నానారావుని ఆశ్రయించక తప్పలేదు. అందుకు ప్రతిఫలంగా అతని కోరికను కాదనలేక ఉండొచ్చు. ఎందుకు ఆమె తప్పు చేసినట్లు? తన కోసం కాదా? తనకి మళ్లీ ప్రాణం యివ్వడంకోసం కాదా? అలాంటప్పుడు ఆమెను ఎందుకు శిక్షించాలి?

మనిషి మనసులో ఎన్ని రంగులు.... ఎన్ని భావాలు....ఎన్ని విప్లవాలు.... ఎన్ని వక్రరేకలు చోటుచేసుకున్నాయి?

చివరికి అతనొక నిర్ణయానికి వచ్చాడు.

జాహ్నవితో మానసికంగా తనకున్న బంధం తెగిపోయింది. ఆమెను క్షమించి కౌగిట్లోకి తీసుకొనే గొప్ప మనసు తనకి లేదు. గుండెల్లో మండుతున్న చితి మంటల్ని పైకి కనబడనివ్వకూడదు. ఎప్పుడూ ఆమెతో మాట్లాడకూడదు. జీవితాంతం ఆమెపట్ల మౌనం వహిస్తే, తన సమస్య పరిష్కారమవుతుంది. తనలో అలజడి తగ్గి, కొంత ఊరడింపు కలుగుతుంది. అందుకే ఆ గాథా బాధ తనకి తప్ప ఎవరికీ తెలియకూడదు. తెలియనివ్వలేదు.

ఇన్నేళ్లు ఎడారిలో ప్రయాణంలా జీవితం సాగిపోయింది.

ఒకప్పుడు తన ప్రాణాలు కాపాడింది జాహ్నవి. ఇప్పుడు ఆమె ప్రాణాలు తను నిలబెట్టకపోయినా కనీసం ఆమె కోరినట్లు నిజం చెప్పి, మనశ్శాంతి యివ్వాలి. కానీ, ఇనుపతెరల మాటున దాగిన నిజాన్ని తనంతట తాను ఆమెకి చెప్పలేదు. తన మనసులో నిక్షిప్తమైన ఆ రహస్యాన్ని ఎవరితో చెప్పి బయట పెట్టలేడు.

కానీ, ఎలా?

రంగధామ్‌లో ఆపలేని సంచలనం మొదలయ్యింది.

సముద్రంలో కెరటాలు యింకా యింకా హోరుచేస్తూ మీదికి లేస్తూ విరిగి విరిగి క్షణంలో కిందికి పడుతున్నాయి. అతని మనసులో నిశ్శబ్ద తరంగాలు సముద్రంలో తరంగాలతోని పోటీ పడుతున్నాయి.

* * *

హటాత్తుగా తన కళ్ళముందు కనిపించిన అవ్యక్తిని చూడగానే జాహ్నవి మొదట నిర్ఘాంతపోయింది.

అతను సాక్షాత్తు నానారావు.

అతన్ని చూసిన మరుక్షణమే ఆమె శరీరంలో ప్రకంపనం మొదలయ్యింది. గుండెల్లో నుండి ఉద్వేగం పొర్లిపొర్లి వస్తుంది. అణువణువున ద్వేషం నిండిపోతుంది.

ఒక రాత్రి తనను బలవంతంగా లొంగదీసుకోవాలని ప్రయత్నించాడు. దబ్బుతో తనని దోచుకోవాలని రాక్షసుడిలా ప్రవర్తించాడు. తన శక్తిని కూడదీసుకొని అతనికి బుద్ధిచెప్పి ఉండకపోతే క్షణంలో తను సర్వనాశనం అయిపోయేది. భయంకరమైన ఆ గతం తనకి తప్ప ఎవరికీ తెలియదు.

అప్పటి జ్ఞాపకం రాగానే ఆమె కళ్ళలో నిప్పులు కురిశాయి.

"జాహ్నవీ! నీ ఆరోగ్యం ఎలా ఉంది?" నానారావు సౌమ్యంగా అడిగాడు. ఆమె సహించలేకపోయింది.

"వద్దు .... నీ ముఖం నాకు చూపించకు. నువ్వంటే నాకసహ్యం.... ద్వేషం....వెళ్లు. కనిపించకు...."

"నన్ను క్షమించు జాహ్నవీ! నువ్వు నిప్పులాంటిదానివి. ఆరోజు నాకు బుద్ధి చెప్పావు. అప్పటి నా ప్రవర్తనకి జీవితమంతా సిగ్గుపడుతూనే ఉన్నాను."

"ఏవండీ .... మీరెక్కడ ఉన్నారు? తొందరగా రండి...." జాహ్నవి పిచ్చిగా అరిచింది.

లోపలికి నానారావుని పంపించి, గది వెలుపల ఉండిపోయిన రంగధామ్ ఆ కేకలకు తుళ్లి పడ్డాడు.

"ఇతన్ని వెంటనే బయటకు గెంటండి....ఈ దుర్మార్గున్ని ఒక్క క్షణం చూడటానికి యిష్టపడను...." జాహ్నవి ఆవేశంగా మాట్లాడుతుంది. ఆమెను వారించటానికి రంగధామ్ ప్రయత్నించాడు. కానీ, ఆమె ఆగలేదు.

"మీకు తెలియని నిజం ఒకటి ఉందండీ...మీకు చెప్పలేదు. వీడు మనిషి కాదు రాక్షసుడు .... ఒకప్పుడు నన్ను వంచించబోయాడు. నీచంగా ప్రవర్తించాడు. నా జీవితం నాశనం చేయబోయాడు .... వీడ్ని కసిరికొట్టండి. నరకండి. చంపండి .... ఇంకా ఏమైనా చెయ్యండి....ప్లీజ్....నా మాట కాదనకండి...."

జీవితంలో రెండవసారి నానారావు తల వంచుకొని, వెనక్కి తిరిగాడు.

"జాహ్నవీ...."

యుగాల మౌనాన్ని బద్దలుచేస్తూ బిగ్గరగా అరిచాడు రంగధామ్. ఏళ్లతరబడి హిమాలయంలా పేరుకుపోయి, పెరిగిపోయిన ఉద్వేగం, ఉదాసీనం, నిశ్శబ్దం అన్నీ కరిగి నీరై నిజం గ్రహించిన అతని గుండెల్లో వెల్లువ అయింది. దుఃఖం ఆగడం లేదు.

ఉద్రేకంతో ఊగిపోతున్న జాహ్నవి-అతని పిలుపుకి బొమ్మగొట్టుకుపోయింది.

కోటానుకోట్ల మైళ్ళ దూరాన్ని దగ్గర చేస్తూ, రంగధామ్ అచేతనంగా తన గుండెలమీదికి ఆమెను తీసుకొన్నప్పుడు ఆ వాతావరణం నిజంగా స్తంభించిపోయింది.

